అధికం.. అనర్థమే!



రసాయనాలు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

- మోతాదుకు మించి ఎరువుల వాడకం
- పంట దిగుబడి పై ప్రభావం
- రోజు రోజుకు తగ్గుతున్న భూసారం
- నానోయూరియా వినియోగించాలంటున్న నిపుణులు

మాగనూర్: పంటల సాగులో రైతన్నలు అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తుంటారు. అయితే ఏదైనా అధికంగా వినియోగిస్తే అనర్థమే అని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయంలో రోజురోజుకు రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోతుంది. దీంతో నేల భూసారం తగ్గడంతో పాటు పంటల దిగుబడులపై కూడా ప్రభావం చూపి దిగుబడులు పెరగడానికి బదులు తగ్గి ఆర్థికంగా నష్టాలు తప్పవని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఏదైనా పరిమితికి మించి వాడితేనే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

30వేల ఎకరాల్లో పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాగనూర్ మండలం వ్యాప్తంగా 13,500 ఎకరాల్లో పత్తి, 17,800 ఎకరాల్లో వరి సాగుకు రైతన్నలు శ్రీకారం చుట్టారు. ఏటా విత్తనం వేసిన నాటి నుంచి దిగుబడి వచ్చే వరకు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. తద్వారా పంట పొలాల్లో భాస్వరం నిలువలు పేరుకుపోతున్నాయి. సూక్ష్మపోషకాలు తగ్గిపోతున్నాయి. పొంచి ఉన్న ముప్పును నివారించేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవసరం మేరకే వాడాలి..

మండలంలోని ఆయా గ్రామాల్లో గత సీజన్‌లో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడడం ద్వారా పత్తి, వరి పంటల దిగుబడులు తగ్గాయి. పంటల సాగుకు అవసరం ఉన్న మేరకు ఎరువులు వాడాలని అధికారులు చెబుతున్నారు. వరిసాగులో పిలకలు వేసే సమయంలో ఎకరాకు డీఏపీ 50 కిలోల బస్తా, చిరు పొట్టదశలో 25 కిలోల పొటాష్, పత్తి సాగులో డీఏపీ 50 కిలోలు, పూత, కాత సమయంలో 25 కిలోల యూరియా, కాయల సమయంలో 150+15 కిలోల పొటాష్ వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

నానో యూరియా వాడాలి



రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేలలో భూసారం తగ్గి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ప్రస్తుతం యూరియా కోసం గంటలు గంటలు క్యూలైన్లో నిలబడి తీసుకెళ్లడానికి బదులు నానో యూరియా వినియోగిస్తే పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

–సుదర్శన్‌గౌడ్
మండల వ్యవసాయ అధికారి, మాగనూర్

క్లుప్తంగా

బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి

మాగనూర్: మండలంలో బాలిక వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నయ్యుం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రానికి మారుమూల గ్రామాల నుంచి రవాణా సౌకర్యం లేకపోవడంతో బాలికలు ఉన్నత విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న బాలికల వసతి గృహానికి సొంత బిల్డింగ్ లేదనే నెపంతో మక్తల్‌కు తరలించారన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదువుకునేలా మంత్రి స్పందించి మండల కేంద్రంలో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు వినియోగంలోకి తేవాలి



మాగనూర్: ప్రభుత్వ కార్యాలయాల్లో విలువైన పత్రాలు, వస్తువులతో పాటు ప్రభుత్వ సిబ్బంది రక్షణ కోసం ప్రభుత్వం రూ. వేలు ఖర్చు చేసి తహసీల్దార్ కార్యాలయాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నెలల నుంచి పనిచేయడం లేదు. చిన్నపాటి ఖర్చుతో మరమ్మతు చేయిస్తే వినియోగంలోకి తీసుకురావచ్చు. అనుకొని ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాలతో నిందితులను పట్టుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయాలి

ధన్వాడ: డీజేలు తగ్గించి భజనలతో నిమజ్జన ఉత్సవాలు జరుపుకోవాలని ధన్వాడ వినయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఆదివారం ధన్వాడ మండల కేంద్రంలోని అప్పజిగ్రౌండ్ వినూత్న ఫౌండేషన్ మండపం వద్ద వినయక ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం 5వ తేదీ రాత్రి 12 గంటలలోపు ప్రారంభించి 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తి చేయాలని సూచించారు.

గర్భగుడి పునఃనిర్మాణానికి విరాళం



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ శ్రీపద మటి ఆంజనేయస్వామి గర్బగుడి నిర్మాణానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందించారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గణేష్ రూ.50 వేలు, ఉప్పు మారుతి రూ.50 వేలు, మత్రికల్ కుర్వ శ్రీనివాస్ రూ.50 వేలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు డి కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, రాజప్ప, నాగరాజుచారి, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



మక్తల్: మండలంలోని పంచలింగాల గ్రామానికి చెందిన మహదేవ్ ఇటీవల అనారోగ్యానికి గురై మరణించాడు. విషయం తెలుసుకున్న అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆదివారం గ్రామానికి వెళ్లి మహదేవ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.32 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో రామలింగం, జనార్దన్‌గౌడ్, జగదీస్, దండురాము, రాజు, గోవిందు, చేన్నప్ప, వెంకటేస్, తిమ్మప్ప, అంజి, వెంకటప్ప, నర్సింహ, నర్సింహరెడ్డి, రామలింగం పాల్గొన్నారు.

మాదాసి కురువ సంఘం కమిటీ ఎన్నిక

నారాయణపేట: మాదాసి కురువ సంఘం నారాయణపేట మండల, తాలూకా కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణపేట తాలూకా అధ్యక్షుడిగా బండి హనుమంతు, ఉపాధ్యక్షులుగా చిత్తనూరు ఆశప్ప, సాయిలు, ప్రధాన కార్యదర్శి ఒగ్గు రాజు, కార్యదర్శిగా సిద్దిరాములు గౌరవ అధ్యక్షులుగా మల్లప్పను ఎన్నుకున్నారు.

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం



ఊట్కూరు: మండలంలోని అంబేడ్కర్ భవనంలో ఓటు హక్కుపై ఆదివారం సమాచార హక్కు చట్టం కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సభ్యుడు నారాయణ మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. దానిని ప్రతి ఒక్కరు రాబోయే ఎన్నికల్లో వినియోగించుకోవాలని సూచించారు. దేశంలో నివసిస్తున్న ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడం జరిగిందని, దానిని డబ్బుకు అమ్ముకోకుండా అభివృద్ధి చేసే నాయకులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆజమ్మ, బాలరాజు, శివశంకర్, కొండన్‌గోపాల్, పరుశరామ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రెడ్డి సేవా సంఘం ఎన్నికలు

మాగనూర్: ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల రెడ్డి సేవా సమితి ఎన్నికలు ఆదివారం మండల కేంద్రంలోని మార్గదర్శి విద్యాలయం ఆవరణలో నారాయణపేట జిల్లా రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా మల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, సుగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మైపాల్ రెడ్డి అమ్మపల్లి, సంయుక్త కార్యదర్శిగా అరవిందొరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా గోపాల్‌రెడ్డి, సహయ కోశాధికారిగా రాఘవేందర్‌రెడ్డి, సలహాదారులుగా రాఘవరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, నరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి లతో పాటు మరికొందరిని ఎనుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నాయకులు వెంకట్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివరాంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వరస్వామి పల్లకీ సేవ



నారాయణపేట రూరల్: పట్టణంలోని సరాప్ బజార్‌లో కొలువైన బసవేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చకులు మడపతి మంజునాథస్వామి, విశ్వనాథ్‌స్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం బసవేశ్వరుడు, వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలతో పట్టణ పురవీధులగుండా లింగయ్యగుడి వరకు పల్లకీ సేవ కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ బాలింగం, శివకుమార్, సంగు, మల్లికార్జున్, గుండప్ప, జయప్రకాష్.రవి, పవిత్ర, సునీత, మహిళలు, వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మరికల్: వరుసగా మూడు వాహనాలు ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన ఉపేందర్ అనే వ్యక్తి ఆదివారం రాకొండ నుంచి బైక్‌పై మరికల్‌కు వస్తుండగా తీలేర్ స్టేజీ దగ్గరకు రాగానే లారీ, బొలెరో, బైక్ వ రుసగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి ఎగిరిపడ్డాడు. విషయం తెలుసుకున్న పో లీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడి ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

కొత్తపల్లి: సీపీఎస్‌ను రద్దు చేయాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో సోమవారం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 22 నెలలు గడిచినా ఇంతవరకు హామీని అమలు చేయకపోవడంతో తమకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈ ధర్నాను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు టీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, కొత్తపల్లి, మద్దూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, బీమేష్, భాస్కర్, గౌరవ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

మాగనూర్: సీపీఎస్ విధానాన్ని ప్రకటించిన సెప్టంబర్ 1నే హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు బల్‌రాం కోరారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి, మాగనూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బలరాం, తిమ్మన్న, శ్రీనివాసులు, ప్రశాంత్, హుస్సేన్, గోవర్ధన్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యానికి మేలు



పేరపళ్లలో రక్తదానం చేస్తున్న యువకులు

నారాయణపేట రూరల్: ప్రతి వ్యక్తి తన జీవితంలో ఏటా రెండు సార్లు రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని స్నేహ మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని పేరపళ్లలో ఆదివారం గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 24 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో నర్సింలు గౌడ్, వెంకట్రాములు, భీమేష్, ఆంజనేయులు పాల్గొనారు.

మండపం దగ్గర రక్తదాన శిబిరం

మరికల్: మండల కేంద్రంలోని దయానంద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వినాయక మండపం దగ్గర ఆదివారం పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుడు నాగరాజ్ జ్ఞాపకార్థంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేసి సత్తా చాటుదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నర్వలో మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉందేకోడ్ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు కృష్ణయ్యతో పాటు మరి కొంత మంది నాయకులు పార్టీలో చేరగా వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేలా కార్యకర్తలంతా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చ నాయకురాలు లలితమ్మ నియోజకవర్గ నాయకులు కుర్వసత్యం, బీజేపీ మండల అధ్యక్షులు అజిత్‌సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, నాయకులు జగన్నాథం, వెంకటేశ్వర్‌రావు, విజయరామ్, నీరజ్ పాల్గొన్నారు.

చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలి



ప్రతిభ కాలనీలో పేరుకుపోయిన చెత్తా

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో చెత్తా పేరుకుపోయింది. ప్రధానంగా ప్రతిభా కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు ప్రక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో తరుచుగా చెత్తా పేరుకుపోతుంది. ఆ ప్రాతం దగ్గర చెత్తా కుండీ ఏర్పాటు చేయకపోవడంతో కాలనీ వాసులు చెత్తా అక్కడే వేస్తున్నారు. మున్సిపాల్ కార్మికులు సైతం చెత్తాను తీయకపోవడంతో ఆప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతుంది. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా శాతవాహన కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల ప్రక్కన కూడా చెత్తా పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. పక్కనే మాంసాహార దుకాణాలు ఉండడంతో వాటి వ్యర్థాలు కూడా అక్కడే వేస్తుండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది రెండు కాలనీల్లో చెత్త డబ్బాలను ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభం.. కూలేందుకు సిద్ధం



మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్యాటీశ్వరాలయం వరకు చెరువు కట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని రైతులు, పాదాచారులు భయపడుతున్నారు. అసలే వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ స్తంభాలు కూలితే మరింత ప్రమాదం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించక ముందే విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- మాగనూర్

నిమజ్జనానికి తరలిన గణనాథులు



గణనాథుడికి పూజలు జరిపిస్తున్న బీజేపీ నేత సత్యయాదవ్, సభ్యులు



మక్తల్‌లో నిమజ్జనానికి తరులుతున్న వినాయకులు



అశోక్ నగర్‌లో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న బాలుడు

నారాయణపేట/నారాయణపేట రూరల్: పట్టణంలోని గాయత్రినగర్, మండంలలోని కొల్లంపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకులు ఐదు రోజుల పూజల అనంతరం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా ఆదివారం గణనాథులను ప్రత్యేక వాహనంలో శోభాయాత్రగా పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు కోలాటం, యువకులు నృత్యాలు చేస్తూ భాజభజంత్రీలతో చెరువుకు తరలించారు.

మక్తల్: పట్టణంలోని రెడియంట్, సాయిజ్యోతి రెడియంట్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పారా మెడికల్ కాలేజీలో ప్రతిష్ఠించిన గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లారు. నిమజ్జనం సందర్భంగా ఆయా మండపాల దగ్గర లడ్డు వేలం వేశారు. విద్యార్థులు నృత్యాలు, దాండియాలు చేసి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన చెరువుల్లో నిమజ్జనం చేశారు.



ధన్వాడలో గణేశుడిని తీసుకెళ్తున్న యువకులు



నారాయణపేటలో గణేశ్ నిమజ్జనంలో కోలాటం ఆడుతున్న యువతులు

భజనలతో వినాయకుడి శోభాయత్ర

ధన్వాడ: ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు. పురవీధుల గుండా భజనల మధ్య శోభాయాత్ర నిర్వహించారు.

ఘనంగా మహా గణపతి ఉత్సవాలు



నందిపాడ్‌లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక శక్తి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మహా గణపతి బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజైనా ఆదివారం శ్రీ మహాగణపతి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాద్రపద శుద్ధ అష్టమిని పురస్కరించుకొని స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, శమీ పత్రార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్దూరు: వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని నందిపాడ్, పల్లెర్ల, రెనివట్ల, దమ్‌ఘాన్‌పూర్, ఖాజీపూర్, మద్దూరు తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన లంబోదరుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉమ్మడి మద్దూరు మండలంలో దాదాపు 300కు పైగా వినాయక మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించారు.

ఎస్‌ఐ ప్రత్యేక పూజలు

కృష్ణా: మండలకేంద్రంలోని వినాయకుని మండపాల్లో ఆదివారం స్థానిక ఎస్‌ఐ ఎండీ నవీద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, నిర్వాహకులు ఎస్‌ఐను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రజలందరూ సంతోషంగా పండుగను నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహకులు కృష్ణా,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు



కోస్గి: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల్లో ఆదివారం బాంబ్ స్కాడ్ బృందం, డాగ్ స్కాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ప్రత్యేక బృందాలు మండపాల్లో తనిఖీలు నిర్వహించడంతోపాటు పరిసర ప్రాంతాలను సైతం క్షుణ్ణంగా పరిశీలించాయి. పోలీసు శాఖ ముందస్తు శాంతి భద్రత చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

సీసీ కెమెరాల వితరణ



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడులో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన ఓ భక్తుడు సీసీ కెమెరాలను వితరణ చేశాడు. నేరాల నియంత్రణను దృష్టిలో పెట్టుకొని మానెంబాయి వెంకట్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాడు. దీంతో దాతను ఆలయ కమిటీ సభ్యులు, మద్దూరు ఎస్‌ఐ విజయ్ కుమార్ అభినందించారు. ప్రతి గ్రామంలో ప్రజలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

మద్దూరు: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఆదివారం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని బీసీ సంఘం నాయకులు యాదగిరి, బస్వరాజ్, నర్సప్పలు తెలిపారు. మద్దూరులో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలందరూ రుణపడి ఉంటారన్నారు.

పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి



మాగనూర్: మండలంలోని తళంకేరి గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో నూతన పంచాయతీలను ఏర్పాటు చేసి పంచాయతీ భవన నిర్మాణాలనకు చర్యలు చేపట్టింది. తళంకేరి గ్రామపంచాయతీ భవనానికి కూడా చర్యలు చేపట్టడంతో పనులు ప్రారంభమయ్యాయి. అయితే నిధుల సమస్యతో పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏళ్ల గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ భవన నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు పరిపాలన సులభతరం చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

దామరగిద్ద: గణేష్ మండపాల్లో దొంగతనాల నివారణకు వాలంటీర్లను నియమించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ రాజు సూచించారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు బాపన్‌పల్లి తదితర గ్రామాల్లోని గణేష్ మండపాల్లో పాయింట్ బుక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉత్సహ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ మండపాల్లో ఫైర్ సేఫ్టీ కలిగి ఉండాలని విద్యుత్ ప్రమాదాలు జరగనివ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆయా మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామ శివారులోని విశ్వనాథ్‌పాటీల్ పొలంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. తెలుగు వెంకటేష్, విజయకుమార్, షేక్ మహ్మద్ , ఫిరంగి తిప్పణ్ణ, శివప్పనును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నవీద్ తెలిపారు. అలాగే వీరి నుంచి రూ.14,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.